# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



జగిత్యాల రూరల్: కొనుగోలు కేంద్రం నుంచి లారీలో ధాన్యాన్ని తరలిస్తున్న అధికారులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసినట్లు ఏపీఎం గంగాధర్ తెలిపారు. శనివారం మండలంలోని పొలాస, వెల్దుర్తి, నర్సింగాపూర్, అంతర్గాం, కల్లెడ, జాబితాపూర్, ధర్మారం, మోతే గ్రామాలను ఆయన సందర్శించారు. అంతర్గాం, వంజరిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు వెల్లడించారు. మిగతా కేంద్రాల్లో కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూరల్ మండలంలో 17 కొనుగోలు కేంద్రాల్లో 69, 555 క్వింటాళ్లు, అర్బన్ మండలంలోని ఐదు కేంద్రాల్లో 15,570 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో సీసీలు గంగారాం, రవీందర్, మంగ, విద్యాసాగర్, వీవోఏలు, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

### ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు

పెగడపల్లి, డిసెంబర్ 2: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం వరకు 8 కొనుగోలు కేంద్రాల ద్వారా 30 వేల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల సెర్ప్ ఏపీఎం సమత పేర్కొన్నారు. ఐతుపల్లిలో 4934, బతికపల్లిలో 4983, మద్దులపల్లిలో 7200, నామాపూర్‌లో 1448, రాజారాంపల్లిలో 4650, రాంభద్రునిపల్లిలో 4620, రాములపల్లిలో 2386 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రైస్ మిల్లులకు తరలించామని, కొనుగోళ్ల వివరాలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఏపీఎం వివరించారు. రైతుల ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమవుతున్నట్లు తెలిపారు.



పెగడపల్లి: మద్దులపల్లి కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

# లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ



ధర్మపురి: నరసింహస్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

ధర్మపురి, డిసెంబర్ 2: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువైంది. కార్తీక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామివారితో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గల ఉసిరి చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా బ్రాహ్మణులకు దీపదానాలు చేశారు.

# నేడు మద్యం దుకాణాలు బంద్

జగిత్యాల, డిసెంబర్ 2 : తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన పోలింగ్ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో నేడు మద్యం దుకాణాలు మూసివేయాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు ఎన్నికల లెక్కింపు సందర్భంగా జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మూసివేయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో..

కథలాపూర్, డిసెంబర్ 2 : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 5 మండలాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాధ సూచించారు. మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో మద్యం దుకాణాలు బంద్ పాటించాలన్నారు. సర్కిల్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కోరుట్లలో నియామక పత్రం అందుకుంటున్న విజయ్

### బీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ ఉపాధ్యక్షుడిగా విజయ్

కోరుట్ల, డిసెంబర్ 2: బీఆర్‌ఎస్ యువజన విభాగం పట్టణ ఉపాధ్యక్షుడిగా జంగిలి విజయ్ నియమితులయ్యారు. శనివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశాలతో ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్ జంగిలి విజయ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్ యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మెట్‌పల్లి పట్టణ శివారులో నేపాలీలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక ఉన్ని దుస్తుల విక్రయ కేంద్రాలు

# పెరుగుతున్న చలి

- ఉన్ని దుస్తులకు డిమాండ్
- నేపాలీలకు ఉపాధి

మారుతీనగర్, డిసెంబర్ 2 : రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలతో చలి నుంచి రక్షించుకోవడానికి ప్రజలు ఉన్ని దుస్తులవైపు చూస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరుగుతున్నది. ఉన్ని దుస్తులు చలి నుంచి కాపాడుతుండడంతో వాటి కొనేందుకు పట్టణ శివారులో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాల్లో సంప్రదిస్తున్నారు. గత సంవత్సరం పట్టణ శివారుల్లో నెలకొల్పిన నేపాల్ నుంచి తీసుకొచ్చిన ఉన్ని దుస్తుల వ్యాపారులకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఈ యేడు మరిన్ని తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్ని దుస్తుల వ్యాపారులు ప్రతి యేడాది నవంబర్‌లో వస్తుంటారు. ఈ ప్రాంతంలో ఉన్ని దుస్తులకు ప్రజల నుంచి మంచి ఆదరణ ఉండడం, నాణ్యమైన దుస్తులను తీసుకురావడంతో గిట్టుబాటు అవుతున్నదని ఉన్ని దుస్తుల వ్యాపారులు చెబుతున్నారు.


# బాస్కెట్‌బాల్ పోటీలకు అంతర్గాం విద్యార్థులు



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన అంతర్గాం విద్యార్థులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 2: ఈ నెల 5న జరిగే ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ పోటీలకు అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ అజయ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్‌లో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో సాహితి, శరణ్య, పూజ, రాహుల్, హర్షవర్ధన్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# లక్ష్మీవేంకటేశ్వరాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న స్వామి కుటుంబ సభ్యులు

కొడిమ్యాల, డిసెంబర్ 2 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన నాంపెల్లి స్వామి-జ్యోతి దంపతులు ఆలయ శాశ్వత చందాదారులుగా రూ.25,116 విరాళాన్ని శనివారం ఆలయ పూజారి నాగరాజు రమేశ్‌కు అందజేశారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

### బొమ్మెనలో బోరుబావి ఏర్పాటు

కథలాపూర్, డిసెంబర్ 2 : మండలంలోని బొమ్మెనలోని ఏడో వార్డులో ప్రజలకు మంచి నీటి సౌకర్యం కోసం శనివారం బోరుబావి ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పిడుగు లావణ్య-తిరుపతిరెడ్డి తెలిపారు. వార్డు ప్రజలకు నీటి సమస్య ఉందని గుర్తించి బోరు మోటర్‌ను ప్రారంభించామని చెప్పారు.